క్లుప్తంగా

మమ్మేలమ్మా.. మహా గౌరీ



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, మండపారాధన, దేవీ ఖడ్గమాల లలితా సహస్రనామార్చన, షోడశ ఉపచార పూజ, వారాహి సహస్రనామార్చన, లలితా అష్టోత్తర పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ముజఫర్‌నగర్‌లో చోరీ

కర్నూలు(సెంట్రల్): ఊరికి వెళ్లి వచ్చే సరికి ఇంటిని గుల్ల చేశారు దొంగలు. బీరువాలోని మూడు తులాల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన ముజఫర్ నగర్‌లోని వసంతనగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వసంత నగర్‌లో నివాసం ఉంటుంటున్న సోమశేఖర్‌గౌడ్ ఈ నెల 16వ తేదీన నంద్యాల సమీపంలోని గాజులపల్లెకు వెళ్లాడు. అక్కడే ఈ నెల 19వ తేదీ వరకు ఉండి తిరిగి వచ్చాడు. అయితే అప్పటికే దొంగలు ఆయన ఇంటి వెనుకాల ఉన్న డోర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని మూడు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. చివరకు చేసేదేమిలేక శనివారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ జరుపుతున్నారు.

దయాల్బాగు ప్రదర్శనకు విశేష స్పందన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన దయాల్బాగు వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించిందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె.భాస్కరరెడ్డి చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రదర్శనలో గంటలోపే మొత్తం వస్తువులన్నీ అమ్ముడుపోయినట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా దయాల్బాగు సంస్థలో తయారైన వస్తూత్పత్తులను ఉత్పత్తి ధరలకే విక్రయించినట్లు చెప్పారు. ప్రదర్శనలో దుస్తులు, బ్యాగ్‌లు, సబ్బులు, అగరబత్తులు, ఆయుర్వేద మందులు, చెప్పులు, షూలు ఉంచినట్లు పేర్కొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి తెలిపారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ..ఖాళీ పోస్టులకు సంబంధించి గ్రూపు-1,2,3,4 పోస్టులతోపాటు మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 31వ తేదీన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ సదస్సుకు ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, లెనిన్‌బాబు హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, శ్రీరాములుగౌడ్, చంటి, సూరి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. మండలంలో ప్రజా ఆదరణ ఉన్న వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ పదవులు పొందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని వారు సూచించారు. వచ్చే ఎన్నికలలో గతంకంటే మరింత మెరుగైన మెజార్టీతో ఫలితాలు పొందేలా ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు.

నేడు మార్కెట్ వేలాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి వారపుసంత, దినసరి, మాంసం మార్కెట్, జంతు వధ శాల, బస్టాండ్‌కు సంబంధించి ఏప్రిల్-2023 నుంచి మార్చి-2024 వరకు సుంకం రుసుము వసూలు చేసుకునేందుకు ఈనెల 27వతేదీన(సోమవారం) స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ అజయ్‌భాస్కర్ తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కబ్జా, బలగం, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, జాన్ విక్ చాప్టర్-4
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, ఘోస్ట్, గీతసాక్షిగా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సార్, వినరో భాగ్యము విష్ణు కథ, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్: తూ జూతీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, జాన్ విక్ చాప్టర్-4
రాజ్ : ఘోస్ట్
శ్రీరామ : ఆరంజ్
విజయ : జాన్ విక్ చాప్టర్-4

జల సోయగం



జగజ్జీవన్ రామ్ సర్కిల్‌లో ఆకర్షణీయంగా ఉన్న ఫౌంటేన్

కర్నూలులో ఫౌంటేన్లు కనువిందు చేస్తున్నాయి. నగరవాసులను ఆహ్లాద పరుస్తున్నాయి. ప్రముఖ కూడళ్లలో వివిధ ఆకృతులతో వీటిని ఏర్పాటు చేశారు. జల సోయగాలతో ఆయా ప్రాంతాల్లో సంచరించే వారిని ఇవి కట్టిపడేస్తున్నాయి. వేసవిలో చల్లదనాన్ని ఇస్తూ ప్రజల మనసును ఉల్లాసపరుస్తున్నాయి.
–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



ఆయకార్ భవన్ సర్కిల్ వద్ద టీకప్పు ఆకారంలో..



కలెక్టరేట్ వద్ద..



మార్కెట్ యార్డు వద్ద ..

సెక్యూరిటీ గార్డులకు జీతాలివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్, ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్ విమర్శించారు. ఈమేరకు ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించి, క్యాజువాలిటి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ పూట కూడా జీతాలు ఇవ్వకుండా ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ గార్డులతో పనిచేయించుకుంటోందని విమర్శించారు. జీతాలు రాకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని, లేకపోతే సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ, సెక్యూరిటీ గార్డ్స్‌యూనియన్ కార్మికులు మధు, కె.రాజాప్రతాప్, మో హస్‌రావు, అయ్యన్న, నర్సప్ప, మురళీ, మారెన్న, జాతన్న, వెంకన్న, కిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన యోగా మహోత్సవం



యోగాసనాలు వేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్: హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామ చంద్ర మిషన్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో హర్ దిల్ ధ్యాన్.. హర్ దిన్ ధ్యాన్ పేరుతో గణేష్ నగర్ రామచంద్ర మిషన్‌లో నిర్వహిస్తున్న యోగా మహోత్సవం ఆదివారం ముగిసింది. భారత్ స్వాభిమాన్ జిల్లా కోఆర్డినేటర్ శివరాజ, పతంజలి సమతి సభ్యులు ఉపేంద్ర గౌడ్‌లు యోగ, ధ్యానం గురించి వివరించారు. యోగాసనాలు సాధన చేయించారు. డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి రోజు యోగా చేడయంతో ఆరోగ్యంతోపాటు ఉత్సాహంగా ఉంటామన్నారు. మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్ర మిషన్ కర్నూలు, అనంతపురం జోనల్ కోఆర్డినేటర్ కె.రామాంజనేయులు, కర్నూలు కేంద్రం కోఆర్డినేటర్ బి.పి.వెంకటరెడ్డి, రామచంద్ర మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేక అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉన్నత జీవితానికి భగవద్గీత మార్గదర్శనం చూపుతుందన్నారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేధన చేశారు.

కోలుకోలేక ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు (టౌన్): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ డబ్బర సుధీర్‌కుమార్ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు..కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్‌లో నివసిస్తున్న డబ్బర సుధీర్‌కుమార్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి కోడుమూరు మండలం రామాపురం గ్రామంలో 2 ఎకరాల పొలం ఉంది. అయితే అప్పుల కారణంగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఇంట్లో క్విక్ ఫాస్ అనే శనగలలో కలిపే గుళికలు మద్యంలో కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య మహేశ్వరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరాశ్రయులకు అన్నదానం

తొటి మిత్రుడు వీఎస్ఎస్ సత్యనారాయణ గుప్త జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఫౌండేషన్ పేరుతో ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకురాలు శకుంతల, ఫౌండేషన్ సభ్యులు సెంట్రల్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ పాల్గొన్నారు.

విజేత పంచలింగాల వృషభాలు



పంచలింగాల వృషభాల యజమానులకు నగదు బహుమతి అందిస్తున్న గ్రామపెద్దలు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో వృషభాల రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి రూ.25 వేలు పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు, రెండో బహుమతి రూ.20వేలు సోమయాజులపల్లె గ్రామానికి చెందిన నరసయ్య వృషభాలు, మూడో బహుమతి రూ.15వేలు ముక్కమల్ల చంద్రశేకర్‌రెడ్డి, బుక్కాపురం మద్దయ్యలకు చెందిన ఎద్దులు, నాల్గవ బహుమతి రూ.10వేలు మల్యాల గ్రామానికి చెందిన నైమున్నా, ఐదవ బహుమతి రూ.5వేలు దాసరిపల్లెకు చెందిన సురేష్ కుమార్ వృషభరాజములు గెలుపొందాయి. గ్రామపెద్దల సమక్షంలో విజేతలైన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు.

రిజిస్ట్రేషన్ల లక్ష్యాలను అధిగమించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ కల్యాణి

ఓర్వకల్లు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను మించి రిజిస్ట్రేషన్లు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ పీజీఎస్ కల్యాణి సూచించారు. బడ్జెట్ చివరి మాసం కావడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రత్యేక పని దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఆమె ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ జయవాణి విధులకు ఆలస్యంగా రావడంతో డీఐజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి మాసం కావడంతో రాష్ట్ర ఐజీ ఉత్తర్వుల మేరకు ఆదివారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయా? లేదా అని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో కలిపి రూ.600 కోట్లు రాబట్టేలా ప్రభుత్వ లక్ష్యం కాగా, అందులో గత ఫిబ్రవరి చివరి నాటికి 80 శాతం సాధించినట్లు తెలిపారు. అందులో ఓర్వకల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సంబంధించి రూ.20 కోట్ల లక్ష్యానికిగాను రూ.12.06 కోట్లు రాబట్టి 78 శాతం సాధించినట్లు ఆమె వెల్లడించారు. గత రెండేళ్ల నుంచి భూరిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టగా, రియల్ ఎస్టేట్ రంగంలో ప్లాట్ల కొనుగోలు పుంజుకుందన్నారు.

'రాహుల్‌గాంధీని ఎదుర్కొనే దమ్ము మోదీకి లేదు'



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): 2024 ఎన్నికల్లో రాహుల్‌గాంధీని నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం మోదీలో లేదని, అందుకనే దొడ్డిదారిన గెలవాలని చూస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు విమర్శించారు. ఆదివారం రాహుల్‌గాంధీపై వేసిన కేసునకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరువునష్టం దావా కేసును సాకుగా చూపి రాహుల్‌గాంధీ ఎన్నికల్లో పాల్గొనడానికి వీల్లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. కేసును కాంగ్రెస్ పార్టీ కోర్టుల ద్వారానే ఎదుర్కొంటుందన్నారు. 9 ఏళ్ల మోదీ పాలనలో దేశానికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు సత్యనారాయణగుప్తా, సత్యరాజు, శివానందు, సుబ్రమణ్యం, మద్దిలేటి, వసిబాష దూద్‌పీరా, చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- పెద్దపాడులో సంపు ప్రారంభోత్సవం



పెద్దపాడులోని తాగునీటిని సంపు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కర్నూలు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని పెద్దపాడు గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సంపు, పైపులైన్‌ను ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్దపాడులో పర్యటించినప్పుడు ప్రజలు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం సంపు, పైపులైన్ ప్రారంభించడంతో పెద్దపాడు ప్రజల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఇకపై పెద్దపాడులో తాగునీటి సమస్య ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కల్లూరు అర్బన్‌లో తాగునీటి సమస్యను పరిష్కారించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడనే ఉండేవన్నారు. గ్రామంలో ఇంకా రెండు సంపులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు.

మొదటి వారంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు పూర్తి

నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ...నగరంలో అన్ని వార్డులో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మునగాలపాడు వద్ద రూ.12కోట్లతో చేపట్టిన 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు వచ్చే నెల మొదటి వారంలో పూర్తి కానున్నాయన్నారు. దీంతో కర్నూలు నగర ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. కొన్ని పత్రికలు గండం అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో కథనాలు రాసి ప్రజలను భయాందోళనలకు గురి చేయడం బాధాకరమన్నారు. పాలకవర్గం వచ్చి రెండేళ్లు పూర్తియిందని, ఈ రెండేళ్లలో నగరంలో తాగునీటి సరఫరాను ఎంతలా మెరుగుపరిచామో ప్రజలందరికీ తెలుసన్నారు. కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ఎమ్మెల్యే, మేయర్ సహకారంతో 36వ వార్డు పెద్దపాడు గ్రామంలో లక్ష లీటర్ల సంపు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీంతో ప్రజలకు నీటి సమస్య తీరనుందన్నారు. ఇంకా రెండు సంపులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరడంతో ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశంగా తీసుకుని నెలరోజుల్లో సంపులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్(కార్పొరేటర్) జి.శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు వైజా అరుణ, విక్రమసింహారెడ్డి, సంగాల సుదర్శన్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, డి.లక్ష్మీకాంతరెడ్డి, నారాయణ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, కల్లూరు ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సుకన్య, కృష్ణమూర్తి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, మున్సిపల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఏళ్లతరబడి వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల శాసనమండలి సమావేశాల్లో ఆరోగ్య మిత్రల సమస్యలపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు చర్చించడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు.

అమరవీరులకు నివాళి

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అమరవీరుల 92వ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గోకారి భవన్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో మూఢనమ్మకాలను పారద్రోలుదామని పిలుపునిచ్చారు.

పెండింగ్ ప్రాజెక్టుల కోసం పోరుబాట

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ పోరుబాట పట్టనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకపోగా..ఎత్తు తగ్గించాలని కుట్ర పన్నుతోందన్నారు. జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను చేపట్టాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథం, శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

30న శ్రీరామ నవమి వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధిలో రక్తదానం చేశారు. అభిమానులు రక్తదానంతో మరిన్ని స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు జి.శ్రీనివాసయాదవ్, బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఈసీఎఫ్ అధ్యక్షులు తెలుగు భగీరథ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుమారస్వామిరెడ్డి, రామ్‌చరణ్ అభిమానులు పాల్గొన్నారు.

సేవాస్తంభ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పూలవీరయ్య



పూల వీరయ్య,



స్వరూప్‌దత్

కర్నూలు(హాస్పిటల్): సేవాస్తంభ్ రాష్ట్ర ఎన్నికలను ఆదివారం కర్నూలు నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. రిటర్నింగ్ అధికారిగా జి.కె.డి.వరప్రసాద్ వ్యవహరించారు. ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా పూల వీరయ్యను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన జి.స్వరూప్‌దత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు కందుల నాగేశ్వరరావు మాట్లాడుతూ సేవాస్తంభ్‌ను 1969లో కర్నూలు నుంచి మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఉన్న దామోదరం సంజీవయ్య జాతీయ స్థాయిలో బహుజన కులాల ఉద్యోగుల కోసం స్థాపించారన్నారు. అప్పటి నుంచి 18 రాష్ట్రాల్లో ఈ సంఘం కొనసాగుతోందన్నారు. దీని ద్వారా ఇటు ఉద్యోగ సమస్యలు, ఎన్‌జీవోలకు కేంద్రస్థాయి నిధులు రావడం వల్ల దళిత బహుజనులకు ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవాస్తంబ్ సీనియర్ నాయకులు డీపీ.సోమన్న, ఎస్.కోటయ్య, ఎస్.మోహన్‌రావు, ఒడిస్సా రాష్ట్ర అధ్యక్షులు బొమ్మలి కాంతారావు, జాతీయ సీఈసీ మెంబర్ జి.రత్నాకర్, జిల్లా అధ్యక్షులు ఎం.మునిస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.గోపాల్‌సింగ్, ఫైనాన్స్ సెక్రటరీ గుర్రాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన ఆర్ఎస్ఎస్



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ సహ సర్ కార్యవాహ సీఆర్ ముకుంద

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ను గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని ఆర్ఎస్ఎస్ సహ సర్ కార్యవాహ సీఆర్ ముకుంద పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ విశేష నగర సాంఘిక్ ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ స్థాపించి 2025 నాటకి వంద సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. ఆలోగా గ్రామ గ్రామానా, బస్తీ బస్తీలో ఆర్ఎస్ఎస్ నిర్మాణం పూర్తి కావాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ఐక్యతకు పాటు పడాలన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర సహ సంఘ చాలక్ రామకృష్ణ రావు, జిల్లా సంఘ చాలక్ ఎన్‌వీఎస్ గుప్త, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వైఎస్ఆర్ ఆసరా ఉత్సవాలు

కర్నూలు (టౌన్): ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వైఎస్ఆర్ ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్వి.రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 రోజుల పాటు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డుల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా వార్డుల్లో జరిగే ఆసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు 1 నుంచి 12 వార్డుల పరిధిలో స్థానికంగా గడ్డవీధిలోని జమ్మిచెట్టు వద్ద ఉత్సవాలు జరుగుతాయన్నారు. 28 వ తేదీ ఉదయం 10 గంటలకు 19వ వార్డు నుంచి 21వ వార్డు, అలాగే 26వ వార్డు నుంచి 29వ వార్డు వరకు స్థానికంగా శరీన్‌నగర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద, 29వ తేదీ ఉదయం 10 గంటలకు 13వ వార్డు నుంచి 18వ వార్డు వరకు స్థానిక చాణిక్యపురి కాలనీలోని కుడా కార్యాలయంలో, 31వ తేదీ ఉదయం 10 గంటలకు 36, 37, 41 వార్డులకు సంబంధించి వీకర్ సెక్షన్ కాలనీలోని వాటర్ ట్యాంకు వద్ద జరుగుతాయన్నారు. ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు 22 నుంచి 25వ వార్డు వరకు స్థానిక ఆరోరానగర్‌లో ఉన్న జమ్మిచెట్టు వద్ద, 3వ తేదీన 30వ వార్డు నుంచి 35వ వార్డు వరకు స్థానిక ముజఫర్ నగర్‌లోని కమ్యూనిటీ హాలులో, 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు 38వ వార్డు నుంచి 40వ వార్డు వరకు స్టాంటన్‌పురం సెక్రటేరియట్ వద్ద ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.